


—చివుకుల పురుషోత్తం

**మూడో** ప్రపంచ యుద్ధం ముగిసింది.

యుద్ధం ప్రారంభం అయిన అర గంటకల్లా అంతా అయిపోయింది.

శుక్రుడు, బుధుడు, అంగారకుడు, బృహస్పతి, శని గ్రహాలు భూమివంక ఆశ్చర్యంగా చూశాయి. (యురేనస్, నెప్ట్యూన్, ప్లూటోలకు భూమిని గురించి తెలియదు గనుక, అవి అంతగా పట్టించుకోలేదు.) పచ్చ పచ్చగా, తెల్ల తెల్లగా, నీల నీలంగా ఉండే భూమి గ్రహం ఒక్కమారు అగ్ని గోళంలాగా మెరిసింది. ఆ తరువాత ఒక దశాబ్దం పాటు ఆవిరి గోళంగా మారింది. ఆ తరువాత మూడు శతాబ్దాలకు తెల్లగా చందమామ లాగా ప్రకాశించింది. ఆ తరువాత మరి ఏడు శతాబ్దాలకల్లా మళ్ళీ పచ్చ పచ్చగా, తెల్ల తెల్లగా, నీల నీలంగా మారింది.

అయితే ప్రాణులు బహు మొండివి. ఆ ప్రాణుల మనస్సులలో ఉన్న భావాలు ఇంకా మొండివి!

అది ఒక చీకటి గుహ. ఆ గుహ ఉన్న ప్రాంతాన్ని ఇరవయ్యో శతాబ్దంలో మొగల్రాజపురం అనే వారు. అది విజయవాడ అనే ఒకప్పటి పట్టణంలో భాగం.

గుహ వంపులు తిరుగుతూ, లోతులు దిగుతూ ఎంతో దూరం ఉన్నది. అలా చాలా లోపలకు పోగా అక్కడ గుహ చాలా వెడల్పుగా, పొడవుగా ఉంది. అక్కడ కొన్ని ప్రాణులు సంచరిస్తున్నాయి. ఆ ప్రాణులకు నాలుగు కాళ్ళు, జ్యోతులలాగా కళ్ళు ఉన్నాయి. అవన్నీ దిగంబరంగా సంచరిస్తున్నట్లున్నాయి. ఆ విశాలమైన గుహావరణలోకి ప్రాణులు నాలుగు కాళ్ళమీద నడచి వచ్చి కుక్కల లాగా వెనుక కాళ్ళను ముడిచి కూర్చుని ముందు కాళ్ళను నేల కానించి, మొగాలు ఎత్తుకొని చూస్తున్నాయి.

ఎదురుగా అలాంటిదే ఒక ముసలి ప్రాణి మిగతా అందరి లాగే కూర్చుని, తన ఎదుట చేరిన ప్రాణులనూ, దూరంగా మరో గుంపులాగా ఉన్న ప్రాణులనూ చూస్తూ ఉన్నది. దూరంగా కూర్చుని ఉన్న ప్రాణులు మొదటి గుంపులాగే ఉన్నప్పటికీ, అవి మాత్రం నడుముకు ఏవో పీచుతో చేసిన టవల్స్ లాంటివి ధరించి ఉన్నాయి.

మొదటి గుంపుకు ఎదురుగా, ముసలి ప్రాణికి ఆవలగా గుహ గోడమీద ఒక ముసలి వ్యక్తి బొమ్మ ఉంది. ఆ వ్యక్తి ముఖం ముడుతలు పడిపోయి, జలపాలవలెనున్న జుట్టు చిందర వందరగా చెదిరిపోయినట్లు ఉంది. ఆ చిత్రంలోని వ్యక్తి ముఖంలో అనంతమైన విషాదం గూడు కట్టుకుని ఉన్నది.

"బ్రదర్స్ అండ్ సిస్టర్స్!" అని ముసలి ప్రాణి గంభీరంగా తన ముందున్న నగ్న ప్రాణుల నుద్దేశించి అన్నది. అతని ముందున్న నగ్న ప్రాణులు కోలాహలం మాని, మౌనం వహించారు.

ముసలి ప్రాణి పక్కమారు నడుముకు ఆచ్ఛాదన ధరించిన గుంపు వంక అసహ్యంగా చూసి ఇలా అన్నాడు.

"మన సైన్సు ప్రవక్తగారికి కానుకలు చెల్లించండి!"

అలా ముసలి ప్రాణి అనగానే, అతని ముందున్న గుంపు ముందు కాళ్ళను చేతులుగా చేసుకుని తమ ఎదురుగా మట్టి పాత్రకు కట్టిన తాడును మెడలో వేసుకొని నాలుగు కాళ్ళతో నడచి వచ్చి, ఆ పాత్రలను ముసలి ప్రాణి ఎదురుగా, చిత్రానికి ముందుగా పెట్టి, తమ తమ స్థానాలలోకి వెళ్ళి కూర్చున్నాయి.

ఆ పాత్రలో చనిపోయిన (చంపిన) పురుగులు, తెల్లని పుట్టకొక్కులూ ఉన్నాయి. బహుశః ఆ పదార్థాలు ఆ ప్రాణులు తినే ఆహారమేమో! ముసలి ప్రాణి గోడమీద చిత్రం వంక చూస్తూ, పెద్ద గొంతుకతో ఇలా అంది.

"ఎ ప్లస్ బి హోల్‌స్క్వేర్ ఈజ్ ఈక్వల్టు ఎ స్క్వేర్ ప్లస్ బి స్క్వేర్, ప్లస్ టు ఎ బి!"

ముసలి ప్రాణి ముందున్న ప్రాణులు నిశ్శబ్దంగా వింటున్నాయి.

ముసలి ప్రాణి తను చదువుతున్న మంత్రాల్ని ఆపి తన పక్కనే ఉన్న ఒక పళ్ళెక లాంటి దానిని తీసుకుని, అందులోంచి బూడిదలాంటి పదార్థాన్ని తీసి గోడమీద చిత్రంమీద చల్లుతూ అన్నాడు.

"ఈ ఈజు ఈక్వల్ టు యం సి స్క్వేర్!"

పై మాటలనే అంటూ బూడిదను తీసి గోడ మీద చిత్రంపైన చల్లుతూ ఉంటే ఆ బూడిద మాటున చిత్రం ముఖంలోని విషాదం ఇనుమడిస్తూ ఉంటే, నగ్న ప్రాణులన్నీ లేచి నిల్చున్నాయి రెండు కాళ్ళమీద బహు కష్టంగా.

ముసలి ప్రాణి బూడిదను చల్లడం ఆపి, "ఐన్‌స్టీన్! జిందాబాద్!" అని అరిచాడు.

నగ్న ప్రాణులన్నీ—"ఐన్‌స్టీన్! జిందాబాద్" అని గుహంతా మార్మోగేలాగా అరిచాయి.

ముసలి ప్రాణి పూజలాంటి తంతును ఆపి, ఎట్టకేలకూ తన ముందున్న వారితో ఇలా అన్నాడు—

"బ్రదర్స్ అండ్ సిస్టర్స్! దేవ భాషను వదలి తెలుగులో మాట్లాడుతున్నందుకు మన్నించండి. రాను రానూ దేవ భాష ఎవ్వరికీ తెలియకుండా తయారైంది. అందుకనే అవతల ఉన్న గుంపు దేవభాష అయిన ఇంగ్లీషును మాతృభాష అంటున్నారు ...!

అద్సరే! అసలు ఈ నాడు మనమంతా ఇక్కడ ఎందుకు చేరామో మీకు తెలుసు ననుకుంటాను.

మూడో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రతి సంవత్సరం—ఇలాగా సైన్సు పూజలు జరుగుతూ ఉండేవి. వెయ్యి సంవత్సరాల తరవాత ప్రతి పది సంవత్సరాలకు ఇలా జరుగాలని పెద్దల శాసనం ..."

"అవును! అవును!" అని నగ్న ప్రాణులు అన్నాయి.

"మన మూల పురుషుడిని ఇప్పుడు స్మరించుకోవడం ముఖ్యం!"

"అవును! అవును!"

"మన మూల పురుషుడైన సుబ్బారావు మూడవ ప్రపంచ యుద్ధానికి ముందు విజయవాడలోని ఒక కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్! ఆయనగారి ఆయిడియా వల్లనే ఈ మానవ జాతి ఇంతకాలం, ఇంత ఘోర విపత్తును తట్టుకుని మనగలిగింది. మూడో ప్రపంచ యుద్ధం వస్తుందని ఆయన ముందుగానే ఊహించి ఈ గుహల దగ్గర నివసిస్తూ, రహస్యంగా మరో ఫిజిక్స్ లెక్చరర్ సాయంతో ఈ గుహలను నివాస యోగ్యం చేసి అదనుకోసం వేచి యున్నాడు. ఇంతలో మూడో ప్రపంచ యుద్ధం వచ్చిందన్న వార్త తెలిసింది. సుబ్బారావు తన కుటుంబంతోపాటు ఇంకో ఫిజిక్స్ లెక్చరర్ కుటుంబాన్ని కూడా గుహలోకి తెద్దా మనుకున్నాడు. కాని, విధి మరోరకంగా పరిణమించింది. ఆ ఫిజిక్స్ లెక్చరర్ కుటుంబంతో సహా సినిమా కెళ్ళాడు. సమయానికి మరో ఫిలాసఫీ లెక్చరర్ తోడయ్యాడు. మన మూల పురుషుడు సుబ్బారావు అనాలోచితంగా ఫిలాసఫీ లెక్చరర్ కుటుంబాన్ని గూడా వెంటబెట్టుకుని ఈ గుహల్లో చేరాడు. అందువల్లనే సైన్సంటే నమ్మకంలేని నాస్తికులు తయారయ్యారు!" అంటూ, ముసలి ప్రాణి దూరంగా వస్త్రాలను ధరించిన ప్రాణులవంక ద్వేషంగా చూశాడు.


## ❊ నూతన యవ్వనం పొందండి ❊



జీవితములో పోగొట్టుకున్న యవ్వనము నరముల బలహీనతలను తిరిగి పొందుటకు ఇతర చికిత్సల వలన ప్రయోజనము పొందక విసుగుచెందినవారు సంపూర్ణ సుఖము పొందుచున్నారు

*భారత ఆయుర్వేద వైద్యములో నిపుణత పొందిన*

**కవిరాజ్. డా॥ డి. హనుమంతరావు (L.I.M.S)**

మహంకాళీవీధి. సికింద్రాబాదు.

సలహాఫీజు 10 రూ॥లు, మందులచార్జీలు ప్రత్యేకం.

సంప్రదించువేళలు:

ఉదయం 8 నుండి 12 వరకు, పగలు 3 నుండి 7 వరకు.

ఆదివారం: ఉదయం 8 నుండి 12 వరకు.

**ప్రతి నెల 4, 5 తేదీల్లో విశాఖపట్టణం హోటల్ డాల్ఫిన్ (?)**





Tom & Bay 60/82-T

నగ్న ప్రాణులు మొగాలు తిప్పి వస్త్రధారులను చూసి గుర్రుగుర్రు మన్నాయి.


"మనం ఉండే చోటుకు సరిగా క్రిందుగా అమెరికా అనబడే పాతాళలోకం ఉంది. అదే దేవ లోకం! ..."

"అమెరికా లేదు గిమెరికా లేదు!" అంటూ వస్త్రధారులలో ఒకడు అరిచాడు. ముసలి ప్రాణి క్షణకాలం కోపంతో ఘూర్ణిల్లింది. అయినా సంభా ళించుకుని మళ్ళీ చెబుతున్నాడు.

"ఆ పాతాళ లోకంలో ఆ ప్రక్కనే ఉన్న ఐరోపా లోకంలో ఈ సైన్సు శాస్త్రం ఉద్భవిం చింది. మతం అనే మత్తులో ఉన్న ప్రజానీకాన్ని తట్టి లేపింది. రేడియోలు, టి. వి. లు, కార్లూ, రైళ్ళూ, విమానాలూ నిర్మించింది. హైడ్రోజన్ బాంబు, ఆటంబాంబు, న్యూట్రాన్ బాంబుల్లాంటి మహాస్త్రాలను నిర్మించింది!"

"అన్నీ కోతలు!"

ఈ తడవ ఈ కేక నగ్న ప్రాణుల్లో నుంచి




వచ్చింది.

ముసలిప్రాణి క్రోధంతో కొంతసేపు అవా క్కైనాడు. ఆఖరుకు ఇలా అన్నాడు.

"నన్ను నమ్మండి! నేను నిజమే చెబుతున్నాను. సైన్సు అన్నది ఒక నిజమైన శాస్త్రం! అది తెలుసు కున్న వారికి కార్లూ, రైళ్ళూ, విమానాలు చేయడం వస్తుంది."

"ఏదీ ఒక కారు చేసి చూపించు."

వస్త్రధారులలో నుండి ఈ ప్రశ్న సూటిగా వచ్చి ముసలి ప్రాణికి గుచ్చుకుంది. ఆ ప్రశ్నకు ఆ ముసలి ప్రాణి విలవిలలాడింది. సమాధానం తోచక జగజగజ వణికింది.

"నా మాటలను నమ్మండి. మనం మూడో ప్రపంచ యుద్ధంలో సర్వ నాశనం అయ్యాము. అంతకుముందు భూమి మీద వెలుగులో, గాలిలో రెండు కాళ్ళతో నడుస్తూ సైన్సు వల్ల చిత్ర విచిత్రాలు చేశాము. కానీ కాలం మారింది. మనం, గుహల్లో చేరి, ఆ గుహలను వెయ్యి సంవత్సరాలుగా ఇంకా తవ్వుకుంటూ వృద్ధి పొందాము. పాత అనాగ రికపు తిండిని వదిలేసి, సైన్సు శాస్త్ర రీత్యా ఉత్తమమైన కీటకాలనూ, పుట్టకొక్కులను పండించుకొని తింటున్నాము. వెనుకటి మూర్ఖుల వలెగాక, హాయిగా నాలుగు కాళ్ళ మీద నడిచేలాగా పరిణమించాము. మన మూల పురుషుడు హడా విడిగా కొన్నిఫిజిక్స్ గ్రంథాలనే తేవడంతో మనసైన్సు విజ్ఞాన రాసి చాలావరకు పోయింది. అందువల్ల కార్లు వగైరా చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపో యాము. కానీ ఈ సైన్సును నమ్మండి! ఇది మీకు అనంతమైన సంపద అను ఇస్తుంది. నిజానికి ఈ ఈజూఈక్వల్ టు యంసి స్క్వేర్ అన్నది మహ త్తరమైన మంత్రం. దీనినే దేవ భాషలో ఈక్వేషన్ అంటారు! ఇందులో సృష్టి రహస్యం ఉంది! దీనివల్ల కరెంటు పుడుతుంది! బాంబు పుడతాయి. ఇంకా ఇంకా ..."

"అవన్నీ వద్దయ్యా! అంత నిప్పును పుట్టించు. లేకుంటే సైన్సు నాస్తికులలో కలిసిపో!" అన్న దో గొంతు వస్త్రధారులలోనుండి.

ముసలి ప్రాణం గింజుకుంది.

ఇంతలో నగ్నప్రాణులలో నుండి ఒక గొంతు వినిపించింది.

"ఏందయ్యా! ఈ ముసుగులో గుద్దులాట. నిజంగా ఆ మంత్రంలో అంత శక్తి ఉంటే! కాస్త నిప్పును పుట్టించు."

ముసలిప్రాణి తన అనుయాయులలో గూడా నాస్తికులుండటాన్ని గమనించి నిర్విణ్ణుడయ్యాడు.

ఆఖరుకు తెగించినట్లుగా లేచి తన పక్కన ఉన్న పళ్ళికను గ్రహించి, అతని సైన్సు దేవతల లాగా రెండు కాళ్ళమీద నిలబడి పళ్ళికలోని బూడిదను ఐన్‌స్టీన్ చిత్రంపైన పడవేస్తూ "ఈ ఈజ్ ఈక్వల్ టు యంసి స్క్వేర్!" అని చాలాసేపు అరుస్తూ ఉన్నాడు.

ఏమాత్రం నిప్పు పుట్టక పోవడంతో నగ్న ప్రాణులు, వస్త్రధారులూ దూర దూరంగా నాలుగు కాళ్ళమీద నడుచుకుంటూ వెళ్ళిపోయారు.

ముసలి ప్రాణి ఐన్‌స్టీన్ వంక చూస్తూ బూడిదను చల్లుతూ మంత్ర పఠనాన్ని చేస్తూనే ఉన్నాడు—దీనంగా, ప్రాధేయపడుతున్నట్లుగా.

దూరంగా వస్త్రధారులైన ప్రాణులలో — రెండు ఆడవి—వయస్సులో నున్నవి ఇలా మాట్లాడు కుంటున్నాయి.

"సరళా! ఈ రోజుతో ఈ సైన్సువాదుల బండారం బయటపడింది. ఆ ముసలోడు ఏంటో మంత్రం చదువుతాడు. అందులో బాంబు లుంటాయంటాడు. విద్యుచ్ఛక్తి ఉందంటాడు. కాస్త నిప్పును పుట్టించమంటే చేతగాక ఎంత అవస్థను పడుతున్నాడో గమనించావా?"

"అవునే, విరళా! ఈ ముసలాళ్ళు ఇంత అసంబద్ధపు మూఢనమ్మకాలను మన నెత్తినవేసి రుద్దాలని ఎందుకంత తంటాలు పడ్తారో అర్థం గాదు."

"నిజమేనే! మూఢ నమ్మకాల విషయంలో మనవాళ్ళూ అంతే! ఏంటో ఆత్మ, పరమాత్మ, జీవుడూ, యోగం అంటూ గొప్పలు చెప్తారు. వాటిని తెలిసిన వాళ్ళెంతమంది ఉంటారంటావ్?"

"నిజమే మనవాళ్ళు గూడా మూఢాచార సంప న్నులే. ఈ గుహను వదిలిపెట్టి భూమిపైకి వెళ్ళవద్దంటారు. అదేమంటే భూమిపైన రేడియేషన్ ఉంటుంది గనుక చస్తామట."

"అవునే. దానికితోడు కొన్ని అబద్ధపు కథలు! ఆ సైన్సువాదుల మూలపురుషుడు భూమిపైకి వెళ్ళవద్దని శాసించాడట. మూడో ప్రపంచయుద్ధం జరిగాక మూడొందలేండ్ల కిందట మనవాళ్ళు గుహను వదలి భూమిమీదకు వెళ్ళి, కండ్లుపోయి తిరిగివచ్చి, ఎముకల నొప్పితో చనిపోయారట! నిజమే అయి ఉంటుందంటావా?!"

"ఏమిటో పురాణగాథలు! నాకు నమ్మకంలేదు."

"మరి మనం భూమిపైకి వెళ్దామా?!"

"అమ్మో!"

"ఇంతేనా నీ బడాయి!"

"మరి నీవు...భూమిపైకి వెళ్ళగలవా?"

"ఆఁ!"

ఇద్దరూ కొద్దిసేపు మౌనంగా ఉన్నారు.

ఆఖరుకు సరళ అన్నది. "సరే! ఇద్దరం వెళ్దాం."

"పద."

సరళ, విరళలు నాలుగు కాళ్ళతో నడిచి నట్లుగా నడుస్తూ బయలుదేరారు. అరగంట నడిచాక దూరంగా తెల్లగా, మిరుమిట్లు గొలుపుతున్నట్లుగా గుహద్వారం కనుపించింది. ఇద్దరు కండ్లు చికిలించుకుని, ముఖానికి వెలుగు సోకకుండా, ఒక చేతిని ముఖానికి అడ్డంగా పెట్టు కుని నడుస్తున్నారు.

ఎట్టకేలకూ సరళ, విరళలు గుహ ముఖ ద్వారాన్ని చేరి కండ్లు చికిలించుకుని, భూమిమీద దృశ్యాలను చూశారు.

ఆకాశాన్నంటే రకరకాల వృక్షాలూ, కొండలూ, రకరకాలా పక్షులూ ఆ దృశ్యంలో ఉన్నాయి.

ఒకప్పుడు మహానగరం ఉన్న జాడ బొత్తిగా కనుపించడం లేదు. అరణ్యాలు పెరిగిన రెండు కొండలూ, వాటి నడుమ కృష్ణవేణి నదిని చూసి వారిరువురూ దిగ్భ్రాంతులయ్యారు.

గుహల్లో గబ్బిలాలను, పాములనూ, తేళ్ళను మాత్రమే చూసిన వాళ్ళకు భూమిమీద కనబడిన చెట్లూ పక్షులూ అత్యంత ఆశ్చర్యాన్ని పుట్టించాయి.

ఆ ప్రాంతాన్నంతా రెండు గంటలపాటు తిరిగి, అలిసిపోయి సరళ, విరళలు నది వడ్డున చేరి కూర్చున్నారు. నడుములకు కట్టుకున్న పిడతలను విప్పుకొని అందులో గల పురుగులనూ, పుట్టకొక్కులను ఆనందంగా తింటూ మాట్లాడుకుంటున్నారు.

"విరళా! నీ కేమన్నా ఎముకలలో నొప్పి పుడుతున్నదా?" అనుమానంగా అడిగింది సరళ, తన దేహాన్ని తడిమి చూసుకుంటూ.

"వూహు. ఈ రేడియేషన్ అన్నది గూడా కట్టుకథేనన్న మాట. ఎంత మూఢ నమ్మకం? మనం హేతువాదులం. ఇలాంటి చెత్తను నమ్మగూడదు !"

"అవునూ! భూమి మీద సూర్యుడూ, చంద్రుడు ఉంటారట—ఏవీ?" అంటూ ఆకాశం వంక చూస్తున్నది విరళ.

ఆకాశం అంతా మేఘావృతమై ఉంది.

"అవునే! లేవు. ఆ. అన్నట్లు అటు చూడు— నదిలో అక్కడక్కడ ఐదారు స్తంభాల లాగా ఉన్నాయి. ఏమిటవి?"

విరళ స్తంభాల వంక కొద్దిసేపు పరిశీలనగా చూసింది. అటువంటివే మరి కొన్ని కాంక్రీట్ స్తంభాలు నదిలో నుండి పొడుచుకుని వచ్చినట్లుగా ఉన్నాయి— మరి కొంత దూరంగా.

"సరళా! అవి బహుశా బ్రిడ్జీలు కాబోలునే!"

"బ్రిడ్జీలా? ! ఇవా?"

"అవునే! వెనక మానవజాతి భూమి మీద ఉన్నప్పుడు ఈ బ్రిడ్జీల మీదుగా కార్లూ, రైళ్ళూ వెళ్ళేవట."

"అంతా మోసం! కార్లూ, రైళ్ళూ ఈ స్తంభాల మీదుగా వెళ్ళేవా? ఎట్లా వెళ్ళేవి? ఎంత మూఢ నమ్మకం."

"బహుశా కార్లూ, రైళ్ళూ నది వడ్డు వరకూ వచ్చి, అక్కడనుండి కప్పల్లాగా దూకి ఒక స్తంభం నుండి మరొక స్తంభం మీదుగా అవలి వడ్డుకు చేరి ఉండేవేమోనే!"

విరళ పొట్ట చెక్కలయ్యే లాగా నవ్వుతూ అన్నది.

"సరళా! కార్లంటే కప్పలు కావు. అవి మనుష్యులను మోసుకెళ్ళే వని మన వాళ్ళు చెప్పినట్లు నీకు గుర్తు లేదా? అంటే మనుష్యుల కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండి ఉండాలి. ఎంత మూఢ నమ్మకం! మానవ నిర్మితమైన వస్తువుకు అంత శక్తి ఉంటుందా, సరళా! హేతుబద్ధంగా ఆలోచించు."

"అవునే! ఈ కార్లూ, రైళ్ళూ అనబడేవీ మూఢనమ్మకాలే!"

అలా మాట్లాడుకుని ఇద్దరూ భోజనాలు ముగించుకుని, కొండ ఎక్కడం ప్రారంభించారు. కొండ నిండా పెద్ద పెద్ద చెట్లున్నాయి. అక్కడక్కడా కూలిపోయిన భవనాల తాలూకు సున్నం, ఇటుకలూ కలిసిన దిబ్బ లున్నా అవేమిటో సరళ, విరళలు పోల్చుకోలేకపోయారు. ఆఖరుకు వారు నాలుగు కాళ్ళ మీద నడిచినట్లుగా నడుస్తూ ఒక చిన్న నలు చదరపు కట్టడం దగ్గరకు వెళ్ళారు.

ఆ కట్టడం దృఢమైన బండరాళ్ళతో కట్టబడి ఉంది. సరళ, విరళలూ ఆ కట్టడం చుట్టూ తిరుగుతూ దానికి ఒక వైపు ద్వారం ఉంటాన్ని గ్రహించి అందులోకి ప్రవేశించారు. ఆ కట్టడంలో ఉన్న విగ్రహాన్ని ఆశ్చర్యంగా చూశారు.

"సరళా! అటుచూడు! అక్కడొక మానవాకృతితో ఉన్న బండరాయి లాగా ఉంది."

"అవునే! స్త్రీ ఆకృతిలో ఉందే!"

"ఆ! తెలిసింది. ఆ విగ్రహం దుర్గాదేవిది!"

"ఈ విగ్రహమేనా దుర్గాదేవి! అనంతశక్తి సంపన్నురాలు? రాక్షసులను కోటానుకోట్ల మందిని చంపిన ఆవిడ?"

"అవునట!"



విరళ చటుక్కున ఒక అయిడియా వచ్చిన దాని వలె, ఆ గుడిలో మూల మూలలూ వెతికి, ఒక సాలీడును పట్టుకుని వచ్చి విగ్రహం ఎదురుగా పెట్టి, "ఓ దుర్గాదేవీ! ఈ సాలీడును చంపు!" అన్నది.

సాలీడు చావలేదు. పైగా పాకుకుంటూ వెళ్ళి విగ్రహం తలపైన కూర్చుని సరళ, విరళలను వెక్కిరిస్తున్నట్లుగా ఊగుతున్నది.

విరళ పకపక నవ్వుతూ—"సరళా! మరో మూఢ నమ్మకం పేలిపోయింది! పద" అంటూ వాకిట్లోకి దోవ తీసింది.

వారలా ఆ ప్రాంతంలో తిరుగుతుంటే దృఢమైన బండరాళ్ళతో కట్టబడిన మరో కట్టడం కనుపించింది. అదీ మరొక గుడి అని సరళ విరళలు పోల్చుకున్నారు. అందులో ఏముందో చూదామనుకుంటే వారికి ద్వారం లాగా ఉన్న చోట అడ్డంగా ఒక ఇనుప తలుపు కనుపించింది. ఇదేమిటా అడ్డు అని వారు దానిని తాకగానే, తలుపు జల్లున మట్టిగా అయి రాలిపోయింది. సరళ లోపలికి తొంగి చూసి రెండడుగులు వేసి, వెర్రి కేక వేసి, వెలుపలికి పరుగెత్తింది.

"లోపల ఏముందే?" భయంగా అడిగింది విరళ.

"మరో విగ్రహం! భయంకరంగా ఉంది!"

"విగ్రహాలంటే బండరాళ్ళు! భయమెందుకు? పద!" అంటూ విరళ లోపలికి దోవ తీయగా, సరళ భయంగా ఆమెను అనుసరించింది.

లోపల మరో మానవాకృతి, యోగాసనంలో కూర్చుని ఉంది. గడ్డాలూ మీసాలు విపరీతంగా పెరిగి ఉన్నాయి.

ఆ ఆకృతిని చూసి, ఈవిగ్రహం ఏదేవుడిదా అని తర్జన భర్జనలు చేసుకున్నారు సరళ, విరళ.

ఆఖరుకు ఎటూ తేలక పోవడంతో ఆ ఆకృతికి ఉన్న బారెడు గడ్డం, మరో రెండు బారలు జడను తాకుతూ విరళ అన్నది—"సరళా! ఇటు చూడు. ఈ విగ్రహాన్ని కున్న జుట్టు అచ్చం మన జుట్టు లాగా ఉంది!"

సరళ ఆశ్చర్యంగా తన తల వెంట్రుకలను తాకుతూ, ఆ విగ్రహం జుట్టును, దేహాన్నీ తాకి చూసింది.

"అంతే కాదే, విరళ! ఈ విగ్రహం రాతితో చేయబడలేదు. ఈ విగ్రహపు దేహం మనదేహం లాగే మృదువుగా—అయితే చల్లగా ఉంది."

సరళ విరళలు వో అరగంట పాటు ఆ విగ్రహాన్ని తడుముతూ పరిశీలిస్తున్నారు. క్రమంగా ఆవిగ్రహం వేడి ప్రారంభం కావడాన్ని వాళ్ళు ఆశ్చర్యంగా చూశారు.

ఇంతలో కింగ్ కోబ్రా బుస కొట్టినట్లుగా శబ్దం విన రావడంతో సరళ, విరళలు ఉలిక్కి పడి ఆ శబ్దం విగ్రహంవైపు నుండి రావడాన్ని గమనించి విగ్రహానికి దూరంగా దూకి, విగ్రహాన్ని గమనిస్తున్నారు భయంగా.

ఆ విగ్రహం దగ్గర నుండి నిమిషానికో మారు బుసలు వస్తున్నాయి. క్రమంగా వో అరగంటలో మానవ ఉచ్ఛ్వాస నిశ్వాసలు వెలువడుతున్నాయి.

"విరళా! అది విగ్రహం కాదే! మనిషి లాగా ఉందే!"

"అవునే! మనిషి లాగే ఉంది. మనం పారిపోదామా గుహల్లోకి!"


"చూద్దాం! అది మనిషే అయితే మనల్నేం జేస్తుంది?"

ఇలా వారు తర్జన భర్జనలతో విగ్రహాన్ని గమనిస్తున్నారు. విగ్రహం క్రమంగా మానవుడి వలెనే గాలి పీల్చి వదులుతున్నది. క్రమంగా ఆ ఆకారం కండ్ళు తెరిచింది. సరళ, విరళలు భయంగా ఆ కండ్ల వంక చూస్తున్నారు. ఆ కండ్లు మొదట మిడిగుడ్ల లాగా చలనరహితంగా ఉన్నాయి.

క్రమంగా చలనం ప్రారంభం అయి, నాలుగు కాళ్ళమీద నిలబడిన సరళ, విరళల వంక ఆశ్చర్యంగా చూస్తూ ఉన్నాయి ఆ కళ్ళు.

"గురుదేవా! దాహం! ఆకలి!" అన్నాడు విగ్రహంలా ఉన్న ఆ వ్యక్తి.

"ఆకలిగా ఉందా?" విరళ అడిగింది ఆశ్చర్యంగా, భయంగా.




"అవును!"

"సరళా! నీ పిడతలో ఆహారం నా పిడతలో వేసి నీవు పోయి నీళ్ళు పట్టుకునిరా!" అంటూ సరళను పంపేసింది.

ఇంతలో ఆ విగ్రహం లాంటి మనిషి చేతులనూ, కాళ్ళనూ స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి శ్రమ పడుతుంటే, కీళ్ళు పటపట లాడుతున్నాయి. ఆఖరుకు ఆ వ్యక్తి కాళ్ళనూ, చేతులనూ స్వాధీనం చేసుకుని ప్రశాంతంగా విరళ వంక చూస్తూ ఉంటే, సరళ పిడతతో నీళ్ళను తెచ్చింది.

ఆ వ్యక్తి పిడతను అందుకుని, అందులోని నీళ్ళను గటగట తాగేశాడు. విరళ తన పిడతను ఆ వ్యక్తి ముందుంచింది.

ఆ వ్యక్తి పిడతలోని ఆహార పదార్థాల వంక చూస్తూ, "ఏమిటివి?" అని అడిగాడు.

"నాగరిక ఆహారం! పురుగులూ, పుట్ట కొక్కులూ!"

"ఛీ! ఛీ!"

విరళ వంక ఆ వ్యక్తి, ఆ వ్యక్తి వంక విరళ ఆశ్చర్యంగా చూసుకున్నారు.

"మీ రెవరు? !" అడిగింది విరళ.

"కనుపించడంలా? యోగిని!"

"యోగివా?"

"అవును! మా గురుదేవులు ఎక్కడ? మీరు మాటలు నేర్చిన కోతులా?"

"మేం కోతులం కాదు!" రోషంగా అన్నది విరళ.

"మా గురుదేవులు ఎక్కడ? కొద్ది క్షణాల క్రితం నన్ను యోగ సమాధిలోకి పంపి తను వచ్చి లేపుతా నన్నారు!"

సరళ, విరళలు అయోమయంగా యోగి వంక చూస్తున్నారు. వీళ్ళ వల్ల లాభం లేదని యోగి మరలా పద్మాసనంలో కూర్చుని, శ్వాసను ఆపి కట్టెలాగా బిగుసుకుని పోయి అరగంట అయ్యాక మళ్ళీ కండ్లు తెరిచి సరళ, విరళల వంక జాలిగా, కరుణగా చూస్తూ అన్నాడు.

"హా! మీరు దురదృష్టవంతులైన మానవ జాతికి వారసులు! ఆ! తెలిసింది. నేటికి సరిగా సరిగా వెయ్యిన్నీ పది సంవత్సరాల క్రితం మూడో ప్రపంచ సంగ్రామం జరిగింది.

ఆ సమయంలో నే నిక్కడ యోగాభ్యాసం చేస్తున్నాను. యోగసమాధిలోకి వెళ్ళే కీలకాలను చెప్పి మా గురుదేవులు, తలుపుమూసి వాకిట్లోకి వెళ్ళారు. మూడో ప్రపంచ సంగ్రామం ప్రారంభం అయింది. మా గురువుగారు సర్వ మానవజాతి వలె అస్తమించి పోయారు! ప్చ్! ఆ అన్నట్లు అప్పుడే సుబ్బారావు, సూర్యారావు అన్న ఇద్దరు లెక్చరర్లు మొగల్రాజపురం గుహల్లో కుటుంబాలతో సహా వెళ్ళిపోయారు. మీరు వారి సంతతివారు! అవునా?"

సరళ, విరళలు ఆశ్చర్యంగా అవాక్కై యోగి వంక చూస్తున్నారు.

"ఆ! అంతా అర్థం అయింది. పదండి. మీ రున్న గుహ నుండి ఆ దురదృష్ట మానవులను భూమి మీదకు తెద్దాం. ఇప్పుడు భూమి మానవ నివాస యోగ్యంగా ఉంది" అంటూ యోగి లేచి నిలబడి

తూలుతూ, నిలదొక్కుకుంటూ కొద్ది క్షణాలు గడిపి, ఆఖరుకు గుడి వెలుపలికి వచ్చి, కొద్ది క్షణాలు విషాదంగా తన పరిసరాలను పరిశీలించాడు.

సరళ, విరళలు నాలుగు కాళ్ళ మీద నిలబడ్డారు యోగికి చెరో వైపూ.

"మీరు లేచి నిలబడలేరా?" అడిగాడు యోగి.

విరళ గొంతు సవరించుకుని అన్నది—

"గుహలోకి చేరాక మా పూర్వీకులు వో వంద సంవత్సరాల పాటు, రెండు కాళ్ళ మీద ఇరుకు గుహలలో వంగి వంగి తిరిగారు. ఆ తరవాత డార్విన్ పరిణామ సిద్ధాంతాను సారంగా, రెండు చేతులనూ రెండు కాళ్ళ లాగా ఉపయోగించి నడుస్తూ వచ్చాం! మా దేహాలుకూడా దానికి అనుగుణంగా పరిణమించా యంటాడు మా ముసలి సైన్సు పూజారి. కనక పరిణామ సిద్ధాంతం ప్రకారం, రెండు కాళ్ళ మీద నడిచే మానవులకంటే, ఉన్నతమైన మానవులం మేము!"

యోగి సరళ, విరళల వంక చూసి సన్నగా, విషాదంగా నవ్వాడు.

"సరే! మీరు గుహలలోనే ఉంటారా? లేక గుహలను వదిలి భూమి మీద కొస్తారా?!"

"మా మూలపురుషుడు సైన్సును ఆరాధించ మనీ, గుహ వెలుపలికి ఎవ్వరూ పోరాదని శాసించాడు. ఈ గుహ లోపలే ఉంటూ సైన్సును అధ్యయనం చేస్తూ మరో ఉన్నత శ్రేణి మానవులుగా పరిణ మించాలని మా సైన్సు పూజారి ఆదేశం! అయితే మాకు సైన్సు మూఢ నమ్మకం అన్న అభిప్రాయం ఉంది. అందువల్ల దాదాపు అందరూ గుహను వదల గలరు. పదండి! అందర్నీ పిలుచుకుని వద్దాం!" అంటూ విరళ చకచక నాలుగు కాళ్ళపై నడిచి వెళుతూంటే, ఆ వెనక సరళ ,ఆవిడ వెనుక యోగీ బయలుదేరారు.

విజయవాడ నగరం అంతా మహారణ్య ప్రాంతమై ఉండడం, అందులోని పక్షులు చాలా పెద్ద సైజులో ఉండడం చూసి యోగి ఆశ్చర్యంగా నడుస్తున్నాడు. ఇంతలో 'కిచ, కిచ' మని భూనభోంతరాళాలూ ద్దలయ్యేలా శబ్దం వినవచ్చింది. ముగ్గురూ స్థాణువుల్లా నేలను అంటుకొని పోయారు. ఎదు రుగా చెట్ల సందు నుండి ఏనుగ అంతటి ఎలుక దోవకు అడ్డంగా నిలబడి ఉంది.

అంతలావు ఎలుకను చూసి భయపడి సరళ, విరళలు యోగి చాటున దాక్కున్నారు.

యోగి ఆ ఎలుక వంక ఆశ్చర్యంగా చూస్తూ ఉంటే, ఆ ఎలుక మెల్లగా యోగివంక వస్తున్నది. సరళ, విరళలు యోగి చాటున ఉండి హాహాకారాలు చేశారు.

యోగి ఆ ఎలుక తనను చంపడానికి వస్తున్నట్లు గ్రహించాడు. ఎలుక యోగికి పదడుగుల దూరంలోకి వచ్చింది. యోగి తన కుడిచేతిని ఎత్తి 'ఆగు' అని గర్జించాడు. ఎలుక చటుక్కున ఆగింది.

యోగి ఫట్ అన్నాడు. ఎలుక తలమీద దెబ్బ తగిలినట్లుగా విలవిలలాడి కిచకిచమని భయం కరంగా అరచింది. ఎలుక కండ్లూ, ముక్కూ, నోటి నుండి రక్తధారలు స్రవించాయి. ఆఖరుకు ఎలుక గిరుక్కున తిరిగి అడవిలోకి వెళ్ళిపోయింది.

యోగి చేసిన మహత్కార్యాన్ని సరళ, విరళలు ఆశ్చర్యంగా గమనించారు. ఆఖరుకూ ఆ ముగ్గురూ గుహ ద్వారాన్ని సమీపించారు. సరళ, విరళలు యోగిని ద్వారం దగ్గర ఆపి, గుహలోకి వెళ్ళారు.

సరళ, విరళలు గుహలోకి వెళ్ళగానే నగ్న ప్రాణు లకూ, వస్త్రధారులకు వీళ్ళు భూమి మీదకు వెళ్ళా రని తెలిసింది. వెంటనే వారందరూ చుట్టుముట్టి భూమిమీద విశేషాలను అడిగారు. సరళ, విరళలు భూమిమీద ప్రకృతి సౌందర్యాన్ని గురించి, యోగి గురించి, రాకాసి ఎలుకను గురించీ చెప్పగా వారంతా ఆశ్చర్యంగా విన్నారు. అంతా భూమి మీదకు వెళ్ళామని తయారవగా ముసలి పూజారి—భూమి మీదకు వెళ్ళవద్దనీ, సైన్సు అధ్యయనాన్ని విడిచి మళ్ళీ మానవ జాతి మరం అన్న మత్యులోకి ప్రవేశి స్తున్నదనీ వాదించాడు. అయితే, ఎవ్వరూ పూజారి మాటలను లెక్కచేయక బయలుదేరారు.

పురుషుని ఆదేశాలను విస్మరించి మళ్ళీ మత మహుధ్యంలోకి పోకండి!"


ఇలా ఆవేదనగా అన్న ముసలి పూజారి మాట లను విని విరళ చాలెంజ్ చేస్తున్నట్లుగా అన్నది—

"పూజారిగారూ! ఇన్ని మాటలు అనవసరం. ఒక తుపాకీని మీ సైన్సు ద్వారా చేసి చూపండి. మీ సైన్సు అన్నది మూఢనమ్మకం కాదని నమ్ముతాం!"

పూజిరి గింజుకుంటూ అన్నాడు.

"తుపాకీని చేయాలంటే మన దగ్గర ఉన్న ఫిజిక్స్ శాస్త్రం చాలదు. ఇంకా చాలా, చాలా ఇంజ నీరింగ్ సైన్స్ మూడో ప్రపంచ యుద్ధంలో నశించి పోయింది. ఒకానొకప్పుడు ఈ సైన్స్‌ద్వారా సముద్రాలనూ, అంతరిక్షాలనూ, పంచ భూతాలనూ జయించాం. మనిషిని వీటన్నింటికీ రాజును చేశాం. అలాంటి సైన్సు మూఢనమ్మకం కాదు..."

"ఏమండీ! ఈ మూఢాచార సంపన్నుడితో మన




గుహవాసులంతా గుహ నుంచి వెలుపడి యోగిని కలుసుకుని, అతను ముందు దోవతీయగా అందరూ నాలుగు కాళ్ళతో వెంబడించారు.

గుహ ముఖద్వారంలో ముసలి పూజారి "ఆగండి! అన్న కేకను వేయగా—యోగి, అతన్ననుసరిస్తున్న చతుష్పాద్ మానవులు ఆగి, వెనుదిరిగి చూశారు.

"ఆగండి, మానవులారా! మళ్ళీ మత మహుధ్యం లోకి వెళ్ళకండి! ఆ యోగి ఒక రాకాసి ఎలుకను పిప్పళ్ళజ చేసి పారిపోయేలా చేశాడు. కానీ సైన్సు కూడా — అదే గాదు—అంతకంటే ఎక్కువయే చేయగలదు! సైకాలజీ, పారా సైకాలజీ శాస్త్రాల ద్వారా ఇంతకంటే ఘన కార్యాలు సైన్సు చేయ గలదు. ఆ ఎలుక కంటే బలిష్ఠమైన జంతువులను చంపగల్గిన ఆయుధాలను సృష్టించింది సైన్సు. తుపాకులు, ఫిరంగులు, బాంబులూ, మిస్సైల్స్, ఖండాంతర వేధులను సృష్టించింది.అలాంటిసైన్సును వదలి, సైన్సు శాస్త్రవేత్తలను వదలి, మన మూల

కేల?" అని గలగలా మాట్లాడుకుంటూ నాలుగు కాళ్ళతో సాకుకుంటూ వెళ్తున్నారు గుహవాసులు.

యోగి పూజారి వంక చూస్తూ అన్నాడు:

"పూజారిగారూ! విచారించకండి. సైన్సుశాస్త్రం యొక్క గొప్పతనం నాకు తెలుసును. అలాగే ఆధ్యాత్మిక శాస్త్రాల గొప్పతనమూ నాకు తెలుసు. కాని యుగధర్మం అంటూ ఒకటుంది. ఒకనాటి శాస్త్రం మూఢనమ్మకంగా, మరోనాటి మూఢ నమ్మకం శాస్త్రంగా పరిణమించడం కాలపురుషుని లీలా విలాసం! మనం నిమిత్తమాత్రులం! సెలవు!"

అని యోగి అనగానే, మేఘావృతమైన ఆకా శంలో తళుక్ తళుక్ మని మెరుపులు మెరిసి, ఢణ ఢణమని ఉరిమింది.

ఈ అనంత సృష్టిలో క్షుద్ర కీటకమైన మాన వుల గర్వాన్ని చూసి కాల పురుషుడు వికటాట్టహాసం చేసినట్లుగా ఉన్నాయి ఆ మెరుపుల తళుకులు, ఆ ఉరుముల చప్పుళ్ళు! ★